రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి: జెసి

నరసాపురం :ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలో పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నరసాపురం మండలం మల్లవరంలో జరుగుతున్న రీసర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్ కాని భూములను ఆన్‌లైన్ చేసే సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పులఖండం చిట్టిబాబు మాట్లాడుతూ లిఖితపూడిలో తనకు చెందిన పొలాన్ని రీ సర్వే చేశారన్నారు. అయితే అది సరిగా లేదని, తిరిగి రీ సర్వే చేయాలని జెసికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జెసి మాట్లాడుతూ రీ సర్వే చేయాలని లిఖితపూర్వకంగా కోరితే చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డివిజనల్ సర్వేయర్ కరుణకుమార్, రీసర్వే డిటి వర్ధనపు కిషోర్, వీఆర్ఒ లక్ష్మ స్వామి, సర్వే సిబ్బంది ఉన్నారు.



ఇక సమరమే..!

ముగిసిన పట్టభద్రుల ఎంఎల్‌సి నామినేషన్ల విత్‌డ్రా పర్వం - ఆఖరి రోజు 8 నామినేషన్లు ఉపసంహరణ

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు - పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్య గట్టి పోటీ

పట్టభద్రుల ఓటర్ల ఫోన్ నెంబర్లన్నీ అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి - ఎన్నికల నిబంధనల ప్రకారం ఫోన్ నెంబర్లు ఇవ్వొచ్చా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార సమరం ఊపందుకోనుంది. ఫిబ్రవరి మూడో వారం ప్రారంభమైన నామినేషన్ల పర్వం గురువారం విత్‌డ్రాల పర్వంతో ముగిసింది. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. ఇక మిగిలిన 43 నామినేషన్లలో విత్‌డ్రాకు ఆఖరిరోజైన గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు మిగిలారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా లెక్క తేలిపోవడంతో ఇక నుంచి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. అందుకు సంబంధించి అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మొత్తం 113 మండలాల్లో ఈ ఎన్నికలు జరగనుండగా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 19 మంది ఉన్నారు.

ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకే

ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోసం కూటమికి చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలతోపాటు కూటమి పార్టీలైన జనసేన, బిజెపి నేతలు పని చేస్తున్నారు. ఉద్యోగ, కార్మికులతోపాటు పలు ప్రజాసంఘాలు, పట్టభద్రులు పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు తరపున ప్రచారం చేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో దాదాపు 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మొత్తం అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి ఎలా వచ్చాయనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో పేర్లు తప్ప ఫోన్ నెంబర్లు ఉండవు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ల ఫోన్ నెంబర్లు ఎవరికీ ఇవ్వకూడదని అధికారులు చెబుతున్నారు. మరి ఫోన్ నెంబర్లు అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి ఎలా వెళ్లాయో అధికారులు, ఎన్నికల సంఘం చెప్పాల్సి ఉంది. ఫోన్ నెంబర్లు తీసుకున్న అధికార పార్టీ అభ్యర్థి తన వాయిస్ సందేశాలను ఓటర్లకు పంపిస్తూ తనకు ఓటేయాలని కోరుతున్నారు. ఓటర్ల ఫోన్ నెంబర్లు అభ్యర్థులకు ఇవ్వొచ్చు అనే నిబంధన ఉంటే బరిలో నిలిచిన మిగిలిన అభ్యర్థులందరికీ ఓటర్ల ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా అధికార పార్టీ అభ్యర్థికి మాత్రమే ఓటర్ల ఫోన్ నెంబర్లు వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలనే డిమాండ్ పెద్దఎత్తున విన్పిస్తోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సైతం ఈ ఫోన్ నెంబర్లను ఉపయోగించుకునే పరిస్థితి ఉంది. ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థికి వెళ్లడంపై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

1.పేరాబత్తుల రాజశేఖరం (తెలుగుదేశం)
2.కాట్రు నాగబాబు (తెలుగు నవగర్జన)
3.షేక్ హుస్సేన్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా)
4.కట్టా వేణుగోపాలకృష్ణ (స్వతంత్ర అభ్యర్థి)
5.కాండ్రేగుల నరసింహం (స్వతంత్ర అభ్యర్థి)
6.కాళ్లూరి కృష్ణమోహన్ (స్వతంత్ర అభ్యర్థి)
7.కుక్కల గోవిందరాజు (స్వతంత్ర అభ్యర్థి)
8.కునుకు హేమాకుమారి (స్వతంత్ర అభ్యర్థి)
9.కైలా లావణ్య (స్వతంత్ర అభ్యర్థి)
10.గౌతంబాబు కొల్లు (స్వతంత్ర అభ్యర్థి)
11.చిక్కాల దుర్గారావు (స్వతంత్ర అభ్యర్థి)
12.తాళ్లూరి రమేష్ (స్వతంత్ర అభ్యర్థి)
13.దత్తాత్రేయ నోరి (స్వతంత్ర అభ్యర్థి)
14.దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) (పిడిఎఫ్ అభ్యర్థి)
15.దొరబాబు యాళ్ల (స్వతంత్ర అభ్యర్థి)
16.నీతిపూడి సత్యనారాయణ (స్వతంత్ర అభ్యర్థి)
17.పినిపే నాగభూషణవర్మ (స్వతంత్ర అభ్యర్థి)
18.పిప్పళ్ల సుప్రజ (స్వతంత్ర అభ్యర్థి)
19.పేపకాయల రాజేంద్ర (శుభ) (స్వతంత్ర అభ్యర్థి)
20.బొడ్డు శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
21.బొమ్మనబోయిన విఎస్ఆర్ మూర్తి (స్వతంత్ర అభ్యర్థి)
22.బొమ్మిడి సన్నిరాజ్ (స్వతంత్ర అభ్యర్థి)
23.బండారు రామ్మోహన్‌రావు (స్వతంత్ర అభ్యర్థి)
24.భీమేశ్వరరావు చిక్కా (స్వతంత్ర అభ్యర్థి)
25.మాకే దేవిప్రసాద్ (స్వతంత్ర అభ్యర్థి)
26.మెర్ల శాస్త్రులు (స్వతంత్ర అభ్యర్థి)
27.మోకన అంబేద్కర్ (స్వతంత్ర అభ్యర్థి)
28.రాజపూడి (స్వతంత్ర అభ్యర్థి)
29.జెటి రామారావు (స్వతంత్ర అభ్యర్థి)
30.రేవులగడ్డ ముఖేష్‌బాబు (స్వతంత్ర అభ్యర్థి)
31.వానపల్లి శివగణేష్ (స్వతంత్ర అభ్యర్థి)
32.ఎం.శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
33.శ్రీనివాస్ విష్ణువర్ధుల (స్వతంత్ర అభ్యర్థి)
34.జివి.సుందర్ (స్వతంత్ర అభ్యర్థి)
35.హసన్ షరీఫ్ (స్వతంత్ర అభ్యర్థి)

వైరస్ లేనిచోట్ల మాంసం తినొచ్చు

కలెక్టర్ సిహెచ్.నాగరాణి
వేల్పూరులో వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత ప్రక్రియ పరిశీలన

రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - తణుకు రూరల్

కోళ్లకు వైరస్ సోకిన ప్రాంతాల మినహా ఇతర ప్రదేశాల్లో నిర్భయంతరంగా బాగా ఉడికించిన కోడిమాంసం, గుడ్లను వినియోగించొచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తణుకు మండలం వేల్పూరులో కృష్ణానందం పౌల్ట్రీస్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోళ్ల షెడ్లలో ఆర్‌ఆర్‌టి బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోళ్ల పూడ్చివేత పనులను ఆరా తీశారు. వైరస్ కోళ్ల పూడ్చివేత ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో సాగుతుందా, లేదా అని ఆరా తీశారు. సిబ్బందికి యాంటీవైరల్ డ్రగ్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి విలేకరులతో మాట్లాడుతూ వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీలోని ఐదు షెడ్లలో వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత ప్రక్రియ ఆర్‌ఆర్‌టి బృందాల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు వివరించారు. ఈ ప్రక్రియ నిర్వహణకు పశుసంవర్ధకశాఖతో కూడిన 22 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైరస్ సోకిన కోళ్లను చంపి తవ్విన గుంటలో ఒక లేయర్ కోళ్లు, ఒక లేయర్ లైమ్, ఇలా లేయర్ బై లేయర్ వేస్తూ పూర్తి శాస్త్రీయ పద్ధతిలో సోడియం క్లోరైడ్, పొటాషియం పర్మాంగనేట్ వేసి కోళ్ల పూడ్చివేత చేపడుతున్నామన్నారు. పౌల్ట్రీలో సుమారు 20 వేల కోళ్ల వరకు ఉన్నాయన్నారు. కోళ్ల పూడ్చివేత ప్రక్రియ అనంతరం షెడ్లలోని కోడి ఈకలను ఫైర్ గన్స్ ద్వారా క్లీన్ చేస్తారని, అనంతరం షెడ్లను పూర్తిస్థాయిలో డిసిన్ఫెక్ట్ చేస్తామని తెలిపారు. ఆర్‌ఆర్ టీమ్‌లకు యాంటీ వైరల్ డ్రగ్స్‌ను కూడా అందజేశామన్నారు. ఈ సమీప పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు డిఎంహెచ్‌ఒను ఆదేశించామని తెలిపారు. కోడి మాంసం, గుడ్లు తినకూడదని చెబుతున్నారని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ కేంద్రం, శాస్త్రవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించిందని, కోళ్లకు వైరస్ సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటర్ పరిధిలో మినహా మిగిలిన ప్రాంతాల్లో బాగా ఉడికించి మాంసం, గుడ్లను నిర్భయంతరంగా వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే మనుషులకు వైరస్ సోకిందన్న వార్తల్లో నిజం లేదని, ఇటువంటి అవాస్తవాలను ప్రజలు నమ్మవద్దని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కలెక్టర్ వెంట తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.భానునాయక్, తహశీల్దార్ డివిఎస్‌ఎస్.అశోక్‌వర్మ, ఎంపిడిఒ ఆర్.లోహిత్ ఆనంద్‌నగర్, వివిధ మండలాల పశుసంవర్ధక శాఖాధికారులు, వైద్య నిపుణులు, టెక్నికల్ బృందం, వైద్య సిబ్బంది ఉన్నారు.

తాడేపల్లిగూడెం: బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ అన్నారు. పెదతాడేపల్లి సమీపంలో ఉంగుటూరు మండలం బాదంపూడికి సంబంధించిన పౌల్ట్రీలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో పెద్ద తాడేపల్లి గ్రామంలో గురువారం ఆయన జిల్లాపరిషత్ సిఇఒ ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎక్కడా చికెన్, కోడిగుడ్ల విక్రయాలు చేయరాదని మైక్ ప్రచారం చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.రవిచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేయాలి

కోళ్ల పరిశ్రమ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి
బర్డ్ ఫ్లూ నివారణ చర్యలు వేగవంతం చేయాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో బర్డ్ ఫ్లూతో నష్టపోయిన పౌల్ట్రీ యాజమాన్యాల రుణాలను రీషెడ్యూల్ చేయాలని, అలాగే కోళ్ల పెంపకంపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం తక్షణ ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. బర్డ్ ఫ్లూ అరికట్టే చర్యలను వేగవంతం చేయాలని కోరారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బర్డ్‌ఫ్లూ జిల్లాలో పౌల్ట్రీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని రోజులుగా కోళ్ళు మృతి చెందడంతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా నష్టపోయారని, ఈ రంగంపై ఆధారపడ్డ కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక నానావస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే దీనిపై ప్రభుత్వం స్పందించి రైతాంగాన్ని, కార్మికులను ఆదుకోవాలని కోరారు. గోదావరి జిల్లాల్లోనే కోట్ల కోళ్లను పౌల్ట్రీల్లో పెంచుతున్నారని, ఇవే దేశంలో అనేక రాష్ట్రాలకు సరఫరా చేస్తారని తెలిపారు. బర్డ్‌ఫ్లూ వల్ల చనిపోయిన కోళ్లను మురుగు కాల్వల్లో, పంటకాల్వల్లో పడవేయకుండా ఖననం చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బర్డ్ ఫ్లూపై గ్రామాల్లో అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయని, వీటిపై తక్షణం జిల్లా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై పని చేస్తున్న తనకు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు కోరారు. గురువారం ఆయన నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సిఆర్‌ఆర్ విద్యాసంస్థలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హైస్కూళ్లు, వాకర్స్ గ్రౌండ్స్, వివిధ సంఘాల పెద్దలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఐదుచోట్ల గ్రాడ్యుయేట్ ఓటర్లతో గెట్ టూ గెదర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ ఉద్యోగావకాశాల కల్పన, ఉద్యోగుల పిఆర్‌సి, ఐఆర్, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు, ఎయిడెడ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. వీరరాఘవులుకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, గుడిపాటి నరసింహారావు, వైఎస్.కనకారావు, కె.రామాంజనేయులు, పి.రవి, జి.శివకుమార్, కె.విజయలక్ష్మి, లాయర్స్ యూనియన్ నాయకులు కట్టా సత్యనారాయణ, జెవివి నాయకులు ఎస్ఎన్.రమేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు

ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలి

ఎంఎల్‌సి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని శాసనమండలి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికపై ఏలూరు కలెక్టరేట్ విసి హాలు నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు తదితరులతో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమీక్షించారు. సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్‌శివ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 3,14,984 మంది ఓటర్లు ఉన్నారని, దానికి సంబంధించి 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఎన్నికలకు 70 జోన్లు ఏర్పాటు చేసి, 70 జోనల్ అధికారులను, 95 మంది రూట్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. ఎంఎల్‌సి ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంసిసి కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. జిల్లా, డివిజనల్‌స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు పటిష్టంగా ఉండాలన్నారు. కౌంటింగ్ ఏలూరులోనే జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం పకడ్బందీ ఏర్పాట్లతో, పటిష్ట బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను ఏలూరులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చాలన్నారు. ఏలూరు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత పోలింగ్ శిక్షణ నిర్వహించామన్నారు. సమావేశంలో ఆయా జిల్లాల నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఏలూరు నుంచి సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పలువురు నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు సునీత

బర్డ్ ఫ్లూ వల్ల మనుషులకు హాని ఉండదు

వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కెవి.సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్

బర్డ్ ఫ్లూతో మనుషులకు ఎలాంటి హానీ ఉండదని, అందరూ మామూలుగానే మాంసం గుడ్లు తినొచ్చని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కెవి.సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన వేల్పూరులోని కోళ్ల ఫారాల్లో చేపట్టిన నియంత్రణా చర్యలను ప్రొఫెసర్ల బృందం గురువారం పరిశీలించింది. చేపట్టిన నియంత్రణ చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం రెండు కోళ్ల ఫారాల్లో 20 వేల కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో సంహరించి ఖననం చేసే కార్యక్రమం చేపట్టారు. ఆపై షెడ్లను కెమికల్స్‌తో క్రిమి రహితం చేస్తామన్నారు. సీజ్ చేసిన షెడ్లను మూడు నెలల తర్వాత తెరవడానికి అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ ధూళిపాళ నరేంద్ర, డాక్టర్ చైతన్య, తణుకు మండల పశు వైద్యాధికారి కె.శంకరం భావన్నారాయణ పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ నియంత్రణ చర్యలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ల బృందం

ముగిసిన బధిరుల టి-20 క్రికెట్ పోటీలు

విజేతగా జోన్-3, రన్నర్స్‌గా జోన్-1 జట్లు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వక్తలు

బధిరులు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని ఈ క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిరూపిస్తున్నాయని, భీమవరంలోనే 5వ బధిరుల క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విశేషమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ మినిస్ట్రీరియల్ అసోసియేషన్ ఛైర్మన్ ఎస్.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డేఫ్(మూగ, చెవిటి) వారి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డేఫ్ సంఘం 5వ రాష్ట్రస్థాయి టి-20 క్రికెట్ పోటీలలో ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల పాలకవర్గ సభ్యులు కూనపరాజు రామకృష్ణంరాజు, కంతేటి వెంకటరాజు, నందమూరి రాజేష్, అల్లూరి సూర్యనారాయణ రాజు, మాజీ ప్రిన్సిపల్ అల్లూరి నరసింహరాజు, చెరుకువాడ రంగసాయి, పులపర్తి శ్రీను వరుసగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్‌లో జోన్-3(గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) విజేతగా నిలవగా, ద్వితీయ స్థానం జోన్-1(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) సాధించాయని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీకృష్ణంరాజు, సిహెచ్.తాతారావు తెలిపారు. విశాఖపట్నం ఈస్ట్ ఎంఎల్‌ఎ వెలగపూడి రామకృష్ణ బాబు, తిరుమల సాయి ఎంక్లేవ్ ఫైవ్ అపార్ట్మెంట్ లేడీస్ గ్రూప్ భోజనాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కారడి రాజు, కామేశ్వరిలు బధిర క్రీడాకారులకు అనువాదం కల్పించారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ : ఎంపిడిఒ

గణపవరం : పిఎం సూర్యఘర్ యోజన కార్యక్రమంపై గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటు చేసుకోవటం వల్ల విద్యుత్ బిల్లు తగ్గుతుందని చెప్పారు. దీంతో పాటు పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని అన్నారు. పిఎం సూర్యఘర్ పథకంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంకర్ల రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు. ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అసిస్టెంట్, ఎపిఎం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వ రంగం బలోపేతం కావాలంటే త్వరలో జరగనున్న గోదావరి జిల్లాల ఎంఎల్‌సి నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ విజ్ఞప్తి చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు తరపున ఆయన గెలుపు కోసం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో గత రెండు రోజుల నుంచి ప్రచారం సాగిస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలో జెఎన్‌వి.గోపాలన్ బృందం ప్రచారం సాగించారు. ముందుగా పలు ప్రభుత్వ, ప్రయివేటు, ప్రజా సంస్థల్లో ప్రచారం సాగించారు. రానున్న కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలు బలపడవలసిన అవసరం చాలా ఉందని ఆయన అన్నారు. ఆ రకంగా బలపడడానికి వామపక్షాల అభ్యర్థికి అధికారం రావాల్సి ఉందన్నారు. కోట్లకు పడగలెత్తిన వారే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వస్తున్న ఇటువంటి సమయంలో పేద, మధ్యతరగతి జీవితాలకు అండగా ఉండేందుకు, వారి తరపున పని చేసేందుకు ముందుకు వచ్చిన వ్యక్తి రాఘవులు అని ఆయన అన్నారు. గత 35 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉండి ప్రజా సేవకు అంకితమైన రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటుని వేసి గెలిపించాలని, శాసనమండలికి పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, డోకల రవితేజ, బివి.వర్మ, సందక సూరిబాబు, శాకా కిసింజర్, బొక్క సుబ్బారావు, కె.బాజీ, షేక్ వలి పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సిఐటియు నాయకులు

పంట పొలాల పరిశీలన

నరసాపురం: మండలంలోని సీతారామపురం, రుస్తుంబాద గ్రామాలలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిలకుమారి, ఎఇఒ లక్ష్మీనారాయణ, విఎఎ సురేష్ కుమార్ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ అనిల కుమారి మాట్లాడుతూ పంట పొలాలలో కాండం తొలుచు పురుగు లేదా మొవ్వు తొలుచు పురుగు ఎక్కువగా ఉన్నదని గుర్తించారు. నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రా. ఎకరానికి వాడాలన్నారు. పాము పొడ తెగులు నివారణకు ప్రోపికోనజోల్, టిల్ట్, వ్యాలీడమైసిన్ 200 మిల్లీ లీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అగ్గి తెగులు నష్టపరిమితిలోపు గమనించడం జరిగిందని, దాని నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. రైతులందరూ తమ రైతు సేవా కేంద్రం పరిధిలో గల వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ పంట నమోదు, ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ(యూనిక్ ఐడి) నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. యూనిక్ ఐడి కలిగి ఉండటం వల్ల రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, వ్యవసాయాంత్రీకరణ, మొదలగు రాయితీలకు అర్హులవుతారని తెలిపారు.



పొలాన్ని పరిశీలిస్తున్న ఎడిఎ అనిలకుమారి

మంచి ఫలితాలొచ్చేలా రీసర్వే వేగవంతం

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని చేపట్టిన సర్వేను వేగవంతం చేసి, మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో జిల్లాలో 20 గ్రామాలలో జరుగుతున్న పైలెట్ విలేజీ సర్వేపై సంబంధిత అధికారులతో కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. పైలెట్ విలేజీ సర్వే ఎలా జరుగుతుందని, గ్రామాలు వారీగా ప్రగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది రైతులకు, భూ యజమానులకు నోటీసులు అందజేశారని, నోటీసులు అందజేసిన వారందరూ సర్వేచేస్తున్న సమయంలో వస్తున్నారా అని ఆరతీశారు. జిల్లా స్థాయి అధికారి నుంచి క్రింది స్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేసి ఎటువంటి తప్పిదాలు లేని సర్వే రికార్డులను తయారు చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి తనిఖీలు చేపట్టాలని, రైతులు, భూ యజమానుల సమక్షంలోనే సర్వేలు నిర్వహిస్తే సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసు, ఎంఎకె.కుమార్, కె.నాగభూషణం, జి.మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నర్సింగ్ హోమ్ ఏర్పాటు అభినందనీయం

మాజీమంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని

పెనుమంట్ర : గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఆసుపత్రులు నెలకొల్పడం హర్షణీయమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మార్టేరు పెద్ద వీధిలో శ్రీకృష్ణ నర్సింగ్ హోమ్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య విద్య పొందిన వారు అంతా పట్టణాలు, నగరాలు వెళ్లడం సహజమే అయినా, గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు పెట్టడానికి ముందుకు రావడం పట్ల ఆయన డాక్టర్లను ప్రశంసించారు. స్థానిక ప్రయివేట్ వైద్యులు డాక్టర్ టి.దసరథ రామారెడ్డి, డాక్టర్ మేడపాటి విజయ సింహారెడ్డి, డాక్టర్ పి.కృష్ణకుమార్ రెడ్డి, మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



నర్సింగ్ హోమ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వీరవాసరం : మండలంలోని కొనితివాడ 33 బై 11కెవి సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే చెట్టుకొమ్మలు తొలగించడానికి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఎఇ ఎవిఎస్.అప్పారావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కొనితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నెలమోరు, గవరవరం పాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడమైనదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు డివిజన్ పరిధిలో గల 132/33కెవి నరసాపురం సబ్‌స్టేషన్‌లో ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఎఇ కె.మధుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో శుక్రవారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించవలసిందిగా డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

'వెంకట్రావు మృతి తీరని లోటు'

మొగల్తూరు : నాయి బ్రాహ్మణ సంఘం నాయకుడు, కిల్లర్ట్ విధ్వంసులు ముత్యాలపల్లి వెంకటరావు(65) మృతి సంఘానికి తీరని లోటు అని నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ అన్నారు. మండలంలోని కాళీపట్నం గ్రామానికి చెందిన వెంకట్రావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆ జిల్లా నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కట్టుంగ నరేష్, భీమవరపు ఆంజనేయులు, శంకరరావు సత్యనారాయణ ఉన్నారు.

74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

గణపవరం : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సచివాలయ పరిధిలోని గర్భిణులు 74 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ నాలుగు సార్లు వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ఐరన్ మాత్రలు, కాల్షియం బిళ్లలు వాడాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని తెలిపారు. ప్రతినెల 9, 10వ తేదీలలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, స్టాఫ్‌నర్సు డి.శిరోమణి, కె.సుహాసిని పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి శిక్షణ : సిడిపిఒ

పెనుమంట్ర : అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ఆరు సంవత్సరాలలోపు పిల్లల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చిన అన్ని కార్యక్రమాలను కేంద్రం నిర్వహించాలని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎ.శారద కృష్ణకుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పెనుమంట్ర జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ శిబిరంలో జరిగిన తొలి రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోషణ్ బీ-పఢాయి బి అనేది అంగన్వాడీ ప్రత్యేక ప్రోగ్రాం అని, మిషన్ పోషణ్ 2.0 కింద కార్యక్రమమన్నారు. జాతీయ విద్యావిధానం-2020 కింద గుర్తించబడిన కీలక అభివృద్ధి డొమైన్‌లలో వారి నైపుణ్యాలను పెంపొందించడమే దృష్టిసారించి 6 సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలందరి సమగ్ర అభివృద్ధిని పెంపొందించడానికి ఏర్పాటు చేయబడిందని ఆమె వివరించారు. సూపర్‌వైజర్లు పి.వెంకట లక్ష్మి, టి.పోశమ్మ, సిహెచ్.వెంకట లక్ష్మి అందించారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో యాత్రికులు

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబాని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. రామమండ్రికి చెందిన భక్తులు అప్పారావు, జల్లి ధార వేణి, తంగేళ్ల వెంకటకృష్ణ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సమారాధనలో పాల్గొన్న యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలి

భీమవరం టౌన్ : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల టిడిపి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా భీమవరం పట్టణం ఐబుసుమూరి 29, 30, 31 వార్డుల్లో కూటమి నాయకులు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. కూటమి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, మెరగాని నారాయణమ్మ ఉన్నారు.

మొగల్తూరు : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని టిడిపి మండల నాయకులు తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. మండలంలోని కొత్తట కాళీపట్నం, తూర్పు కాళీపట్నం, పడమర బాధపడు, జగన్నాధపురం, కోమటి తిప్ప గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గుబ్బల నాగరాజు, బొల్ల చంటి పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న పెచ్చెట్టి బాబు

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని 26వ వార్డులో సిమెంట్ డ్రెవ్ నిర్మాణ పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. 2014-19 టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు మున్సిపాలిటీ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలను మంత్రి రామానాయుడు మంజూరు చేయించారు. పనులు మొదలుపెట్టేందుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ దశలో 2019-24లో జగన్ ప్రభుత్వం సిమెంట్ డ్రెయిన్ నిర్మాణం నిలిపివేసింది. దీంతో రూపాయి పని, తట్ట మట్టి పని నోచుకోలేదు. అప్పటి శిలాఫలకం సాక్ష్యంగా కనిపిస్తోంది కూడా. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ఐదేళ్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులతో పాటు అప్పట్లో ఆగిన పనులను మళ్లీ మొదలుపెట్టేలా మంత్రి దృష్టి సారించారు. మళ్లీ డ్రెయిన్ నిర్మాణ పనులను మొదలుపెట్టారు. నిర్మాణ పనులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు గురువారం పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపు

ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఉండి: కోలమూరు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు గ్రామంలో నెలకొన్న ఆక్రమణల తొలగింపును గురువారం సాయంత్రం గ్రామ సర్పంచి నడింపల్లి సత్యవతి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో అధికారులు చేపట్టారు. గ్రామ సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లను ఆక్రమించి, డ్రెయినేజీ సౌకర్యం లేకుండా ఆక్రమించిన ఆక్రమణలను తొలగించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పారిశుధ్య సమస్యను, మురుగు సమస్యను తీర్చేందుకు కృషి చేస్తున్నామని, దీనికి గ్రామస్తులు అందరూ సహకరించాలని వారు కోరారు. ఈ ఆక్రమణల తొలగింపులో గ్రామపంచాయతీ కార్యదర్శి జమాల్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పలాచార్యులు ఉన్నారు.

బెల్టు షాప్ నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి మండలంలోని పడాల గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 5 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని,కసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఉండి : మండలంలోని కోలమూరు గ్రామంలోని కోడిపందేల స్థావరంపై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.40,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఉండి ఎస్ఐ తెలిపారు. కోడిపందేలు నిర్వహించే వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రణాళికాబద్ధంగా ఉపాధి హామీ పనులు

జిల్లా అంబుడ్స్ పర్సన్ జె.ఆదినారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో ప్రధానంగా పంట బోదెల ద్వారానే జాతీయ ఉపాధి హామీ చట్టం పనులు సాగుతున్నాయని జాతీయ ఉపాధి హామీ చట్టం జిల్లా అంబుడ్స్ పర్సన్ జె.ఆదినారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కూలీల సంఖ్య పెంచుతూ వారికి పని కల్పించడానికి ఉపాధి హామీ చట్టం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బోదెల్లో, పంట కాలువల్లో పేరుకుపోయిన తూడు తొలగింపు, మట్టి పూడిక తీత పనులపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంత మంది వేతనదారులున్నారు?

జిల్లాలోని 20 మండలాల్లో ఉపాధి జాబ్ కార్డులు 1.80లక్షలు, యాక్టివ్ జాబ్ కార్డులు 1.37 లక్షలున్నాయి. అందులో 2.96 లక్షల మంది వేతనదారులున్నారు. ప్రస్తుతం 2.12 లక్షల మంది పనులకు వస్తున్నారు.

ప్రశ్న : సగటున ఎంత వేతనం అందుతుంది?

2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి రోజుకు వేతనం రూ.300గా నిర్ణయించారు. జిల్లాలో ప్రస్తుతం సగటు వేతనం రూ.250-260 మాత్రమే నమోదవుతోంది.

ప్రశ్న : వేసవిలో గరిష్ట వేతనం అమలు చేస్తున్నారా?

వేసవిలో కొలతలతో సంబంధం లేకుండా గరిష్ట వేతనం అమలు చేయాలి. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించి, వారికి ఏడాదిలో 100 రోజుల పని పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ఈ ఏడాది లక్ష్యమెంత?

2024-25 ఏడాది ఉపాధి హామీ పనులకు సంబంధించి 40 లక్షల పని దినాలుగా నిర్దేశించాం. రోజు 16 వేల నుంచి 17 వేల మంది కూలీలు పని చేస్తున్నారు.

చిట్ చాట్

ప్రశ్న : వేతనదారులకు అవగాహన కల్పిస్తున్నారా?

కొలతల ప్రకారం పని చేయగలిగితే గరిష్ట వేతనం అందుకోవడం సులువే. ఎలా చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందో వేతనదారులకు క్షేత్ర సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : ప్రణాళికలు తయారుచేస్తున్నారా?

2025-26 సంవత్సరానికి సంబంధించి కార్యక్రమానికి ప్రణాళికలు తయారు చేయడానికి సిబ్బంది సిద్ధం అవుతున్నారు. ఇందుకు పీడీ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసారి సాంకేతిక ఆధారాలతోపాటు శాటిలైట్ సహకారంతో మ్యాపింగ్ తయారు చేసి, సర్వే నిర్వహిస్తాం. ప్రధానంగా నీటి వనరుల అభివృద్ధే లక్ష్యంగా పనులు ఎంచుకుంటాం.

ప్రశ్న : వేతనదారులకు ఏమి అవసరమో తెలుసుకున్నారా?

జిల్లాలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలతో మాట్లాడి వారికి అవసరమైనవి అడిగి తెలుసుకుంటున్నాం. ఉపాధి కూలీలకు జాబ్ కార్డు లేనివారికి 10 రోజుల్లో అందిస్తాం. ఈ విషయాలపై ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న : వేసవిలో ఉపాధి కూలీలకు ప్రత్యేక సౌకర్యాలు ఏమైనా కల్పిస్తున్నారా?

వేసవి దృష్ట్యా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించాం. టార్పాలిన్‌తోగానీ, కొబ్బరి ఆకులతో గాని నీడ సదుపాయం, ఉపాధి కూలీల పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ సదుపాయం కల్పించాలి. కూలీలు తెల్లటి వస్త్రాలతో తలపాగా చుట్టుకోవాలి. 100 రోజుల పనిదినాలను దశలవారీగా పూర్తి చేయాలి.

రోడ్డు నిబంధనలను పాటించాలి

భీమవరం టౌన్ : రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎ.తేజ, సత్యనారాయణ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం భీమవరం ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ మీద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలను ఏటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలని, వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.సత్యనారాయణ మూర్తి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని చెప్పారు. అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలి

ఎంపిడిఒ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం : గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై సర్పంచులు, కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ సూచించారు. మండలంలోని జగ్గన్నపేట, రామన్నగూడెం గ్రామాల్లో గురువారం ఆయన సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహణకు దూరంగా ఉన్న సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటికే గ్రామాల్లో ఏర్పాటు చేయగా చెత్త సెగ్రిగేషన్ ప్రారంభించాలని తెలిపారు. ఇఒపిఆర్ డిఎం.వెంకటేష్ సంపద తయారీ కేంద్రాల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేంద్రంలో చెత్త విడదీసే కార్యక్రమం చేపట్టాలని, నూరు శాతం చెత్త సేకరణ జరగాలని సూచించారు. దీంతోపాటు కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పచ్చటి చెట్లు పెంచాలని, చెట్లపై ఎండ పడకుండా పాదులు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ములకాల సూర్యారావు, కార్యదర్శులు బాలకృష్ణ, వేణు, ఎంఆర్‌సి ఎం.రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం : నరసాపురం పట్టణం లోని చికెన్ వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ విక్రయించే వ్యాపారస్తులు పరిశుభ్రమైన వాతావరణంలో కోడి మాంసం విక్రయించాలని స్పష్టం చేశారు. వ్యాపారులు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించి విక్రయాలు జరపాలని పేర్కొన్నారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండేవారు, వృద్ధులు, చిన్న పిల్లలు కొంతకాలం చికెన్‌కి దూరంగా ఉండటం శ్రేయస్కరమని కమిషనర్ సూచించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : జెసి

నరసాపురం : రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామసభలలో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆర్‌డిఒ ఛాంబర్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై జెసి మాట్లాడారు. పిజిఆర్ఎస్, గ్రామ రెవెన్యూ సదస్సులు, రీ సర్వే 22-ఎ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై ఆర్‌డిఒ, పాలకొల్లు, పోడూరు, నరసాపురం, మొగల్తూరు తహశీల్దార్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలు నమోదు, సదస్సులు రీ సర్వే 22-ఎ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్షించి ఈ అంశాలకు సంబంధించి త్వరితగతిన పురోగతి సాధించాలని ఆదేశించారు. పెండింగ్ ఉన్న ఫైల్స్ అన్ని పూర్తి చేయాలని ఆర్‌డిఒ, తహశీల్దార్లు, సంబంధిత సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్‌లు నరసాపురం టి.రాజేశ్వరి, పాలకొల్లు వై.దుర్గా కిషోర్, పోడూరు సయ్యద్ మౌలానా పజిల్, మొగల్తూరు కె.రాజకిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

బధిరుల క్రికెట్ పోటీలు అభినందనీయం : వైస్ ప్రిన్సిపల్ వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహభావం పెంపొందుతుందని, క్రీడలు దేహదారుఢ్యానికి దోహదం చేస్తాయని భీమవరం డిఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వివిఎస్.వర్మ, ఎన్‌సిసి ఆఫీసర్, మేజర్ డాక్టర్ వీరయ్య అన్నారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో పశ్చిమగోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 5వ రాష్ట్రస్థాయి బధిరుల(మూగ, చెవుడు) టి-20 క్రికెట్ పోటీల రెండోరోజు గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని గుర్తుచేశారు. రెండు రోజులపాటు రాష్ట్రస్థాయిలో బధిరుల క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీకృష్ణంరాజు, సిహెచ్.తాతారావు మా ట్లాడుతూ రెండోరోజు 10 జిల్లాల నుంచి 65 మంది బధిర క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, ముగింపు రోజున రాయలసీమ జిల్లా క్రీడాకారులు కూడా పాల్గొన్నారని తెలిపారు. జోన్-1, 2, 3, 4(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలు) విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు. అసోసియేషన్ సభ్యులు టి.రాము, ఎండి రఫి, కె.రాజు, సిహెచ్.రామచంద్రరావు, కామేశ్వరి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ వైద్యుడు నరసింహరాజుకు నంది అవార్డు

ప్రజాశక్తి - నరసాపురం

అవార్డు అందుకుంటున్న నరసింహరాజు

నరసాపురం పట్టణానికి చెందిన ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్ వైద్యుడు తిరుమాని నరసింహరాజుకి బంగారు నంది అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో తెలంగాణ సాంస్కృతిక పురస్కారాల అకాడమీ నరసింహరాజుకు అవార్డును అందజేశారు. నరసాపురం పట్టణంలోని టిఎన్ఆర్ ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్ ద్వారా ఆయన అందించిన వైద్య సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును బహూకరించారు. తెలుగు కళా రత్నాల సాంస్కృతిక సేవా సంస్థ సిఇఒ డాక్టర్ యువి రత్నం, కన్వీనర్ డాక్టర్ దనశీ ఉషారాణి, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ జగదీశ్వరరావు, వైద్యరత్న డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సామేలు, డాక్టర్ రాజబాబు చేతుల మీదుగా నరసింహరాజు బంగారు నంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నరసింహరాజుని అభినందించారు.

సరోజినీనాయుడు జీవితం స్ఫూర్తిదాయకం

ఇందిరమ్మను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ నిర్మలాకుమారి

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళా సాధికారత కోసం కృషి చేసిన తొలి మహిళ గవర్నర్, కవి కోకిల సరోజినీ నాయుడు అని, మహిళలకు చేసిన సేవలు మరపురానివని ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.రాజరాజేశ్వరి అన్నారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా గురువారం మండలంలోని దుంపగడపలో వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజరాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపల్ శారద మాట్లాడుతూ సరోజినీ నాయుడు మహిళలకు చేసిన సేవలకు గుర్తింపుగా ఆమె జయంతిని ప్రభుత్వం మహిళా దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి లయన్స్ మోర జ్యోతి మాట్లాడుతూ సరోజినీ నాయుడు వేసిన బాటలో నేడు ఎందరో మహిళలు పయనించి అభివృద్ధిలోకి వచ్చారన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ తంగి ఓగేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : సరోజినీ నాయుడు జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆంగ్ల అధ్యాపకులు ఎం.ఇందిరమ్మ అన్నారు. గురువారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమర యోధురాలు, ప్రముఖ కవయిత్రి సరోజిని నాయుడు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరమ్మ అతిథి ఉపన్యాసం నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ మాట్లాడుతూ సరోజినీనాయుడు మహిళా జనోద్ధరణకు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలా కుమారి మాట్లాడుతూ సరోజినీదేవి ఆశయసాధనకు కృషిచేయాలని చెప్పారు. అనంతరం అతిథి ఉపన్యాసం ఇచ్చిన ఇందిరమ్మను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు సిహెచ్.చైతన్య, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

పాలకొల్లు : సరోజిని నాయుడు రచనల్లో భారత దేశ సంస్కృతి ప్రతిబింబిస్తుందని పాలకొల్లు డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పిల్లి శోభారాణి చెప్పారు. జాతీయ మహిళా దినోత్సవం, నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించారు. మహిళా హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకురాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, డాక్టర్ రమణ, డాక్టర్ స్వరూప్ సింగ్, డాక్టర్ మణిమాల పాల్గొన్నారు.

ఆక్వా దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల దాడి

రూ.రెండు కోట్ల 20 లక్షల మందుల సీజ్

మొదటి తప్పుగా వదిలేసిన మత్స్యశాఖ అధికారులు

భీమవరం టౌన్ : దాదాపు దశాబ్దకాలంపైగా లైసెన్సులు లేకుండా అక్రమంగా రొయ్యలు, చాపలు, మేతలు, మందులు అమ్ముతున్న ఆక్వా షాపులపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడి చేసి షాపులను సీజ్ చేయగా, మత్స్యశాఖ జిల్లా అధికారులు మాత్రం మొదటి తప్పుగా వదిలేసారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనకు సంబంధించి వివరాలను పరిశీలిస్తే.. మండలంలోని చిన అమిరం గ్రామ పరిధిలో గత 10 ఏళ్లుగా లైసెన్స్ లేకుండా ఉన్న షాపులపై విజిలెన్స్ అధికారులు శివరామకృష్ణ, ప్రసాద్ కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, మత్స్య శాఖ అధికారి లావణ్య సమక్షంలో దాడులు నిర్వహించారు. శివసాయి ఆక్వా ఫీడ్స్ షాపు నందు కోటి 88 లక్షల 97 వేల 176 రూపాయల విలువ కలిగిన 180.925 టన్నుల చేపల మేతలు, చేపల మందులు గుర్తించారు. అలాగే శ్రీసాయి పవన్ ఆక్వా ఫీడ్స్ షాపు నందు 31 లక్షల 96 వేల 237 రూపాయల విలువ కలిగిన 19.269 టన్నుల చేపల మేతలు, చేపల మందులు గుర్తించి సీజ్ చేసి భీమవరం మత్స్యశాఖ అధికారులకు అప్పగించి విజిలెన్స్ అధికారులు వెళ్లిపోయారు. ఇలా ఉంటే 24 గంటలు గడవకముందే షాపు యజమానులు యధావిధిగా తమ అమ్మకాలను కొనసాగిస్తున్నారని విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అయితే ఇక్కడే మత్స్యశాఖ అధికారులు మ్యాజిక్ చేశారని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొంత లాభమే లక్ష్యంగా సీజ్ చేసిన కొద్ది గంటలకే ఇది తొలి తప్పు కింద హెచ్చరించి వదిలేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రెండు కోట్లపైన అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్న వాటిపై ప్రభుత్వ లెక్కల ప్రకారం, నిబంధనల ప్రకారం ఫైన్ విధించడం మాని తూతూ మంత్రంగా రూ.25 వేల ఫైన్ వేయడంపై బయట మత్స్యశాఖపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు లైసెన్స్ లేకపోయినా ఒక్కసారి కూడా తనిఖీ చేయకుండా వదిలేశారని, వీళ్ల చేతకాకపోయిన విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన దానికి కూడా వీళ్ల విలువ లేకుండా అమ్ముడు పోయారని పలువురు ఆరోపిస్తున్నారు. అసలు మత్స్యశాఖలో ఏమి జరుగుతుందో ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై మత్స్యశాఖ జెడి ప్రసాద్‌ను వివరణ కోరగా.. పలు షాపుల్లో విజిలెన్స్, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు దాడి చేయడం జరిగిందని షాపు సీజ్ చేయలేదని, అయితే మొదటి తప్పుగా క్షమించి కొంత మొత్తం ఫైన్ వేసామని అన్నారు. షాపులకు అసలు లైసెన్సులు ఉన్నాయా అని ప్రశ్నించగా 10 సంవత్సరాల నుంచి షాపులకు లైసెన్సులు లేవని, అయితే 2023లో అప్సాడ అనే పేరుతో లైసెన్సులు ఇవ్వడం జరుగుతుందని, వీటిపై షాపుల యాజమాన్యానికి అవగాహనా కార్యక్రమం చేపడతామన్నారు.

విజిలెన్స్ సిఐ శివరామకృష్ణను వివరణ కోరగా భీమవరంలో రెండు షాపుల్లో తనిఖీ చేసి సుమారు రూ.రెండు కోట్ల 20 లక్షల విలువగల రొయ్యల, చేపల మేతలు, మందులను సీజ్ చేసామని అన్నారు. మత్స్యశాఖ జెడి సీజ్ చేయలేదని విలేకరులు ప్రశ్నించగా సీజ్ చేశామని, పెద్దపెద్ద కంపెనీలు, పరిశ్రమలు అయితే షాప్‌కి సీల్ వంటివి వేస్తారని, కానీ ఇక్కడ స్టాక్‌ని సీల్ చేయడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగానే మత్స్యశాఖ అధికారులు షాపులపై అపరాధ రుసుము విధించాలని తెలిపారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

D.O.P. No. 267/2024

Between:

Kokkirapati Navatha, W/o. Marri Joseph Kumar, D/o. late Kokkirapati Vijay Babu, Hindu, aged 26 years, House wife, R/o. D.No. 20-416, Pragathi Convent Street, Yerrakonda, Dowlaiswaram Village, Rajahmundry Rural, East Godavari District. ***...Petitioner***

AND

Marri Joseph Kumar, S/o. Nagayya, Christian, aged 26 years, Private Employee cum Business, R/o. D.No. 3-110, Vunguturu Village, Vunguturu Mandal, West Godavari District. ***...Respondent***

పై నంబరు D.O.P. 267/2024 లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 07-3-2025వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 13-2-2025 **పి.దోసాలరాజు** అడ్వకేట్, రాజమండ్రి

ఆలయానికి వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురులో శ్రీఉమా మూలేశ్వర స్వామి వారికి దాతల సహకారంతో వంట సామానులు సమకూరాయి. గురువారం దాతలు శరన్ సాయి హేచరీ అధినేత తోట వెంకటరమణ, ఉషారాణి దంపతులు కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు రెండు లక్షల రూపాయలతో వంట సామానులను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలు హోమసాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహకారంతో వంట, హోమసాలను గురువారం దాతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తోట విజయ్‌కుమార్, అడ్డాల ఏడుకొండలు, నిరోగి సూర్యశేఖర్, ముచ్చర్ల సాయి, అడ్డాల రమేష్, తోట పెద్దబ్బులు, శంకరమంచి రఘురామ శర్మ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **YEEDA SURESH BABU** S/o. Yeeda Aseervadah, D.No. 4-84, Saripalli, Narasapuram Mandal, W.G.Dt, A.P. I have changed my name from **YEEDU SURESH BABU** (Old name) to **YEEDA SURESH BABU** (New name) hence forth I am being called **YEEDA SURESH BABU** S/o. Yeeda Aseervadah, for all purposes.

CHANGE OF NAME

I, **P. CHANDRA SEKHAR RAO,** (old name) S/o Padmanabha Rao, resident of D.No: 24-80, Koneru peta, Nuzvid-521201 Ap.

I have change my name as **PUTTA CHANDRA SEKHARA RAO** (new Name), S/o Padmanabha Rao, hereafter my name is know as **PUTTA CHANDRA SEKHARA RAO,** S/o Padmanabha Rao.

దస్తావేజు పోయినది

నా సోదరుడు దివంగత న్యాయవాది బొంతు రాజేంద్రప్రసాద్, తండ్రి: సుబ్రహ్మణ్యం, నరసాపురం పట్టణమునకు చెందిన ఖాళీ నివేశ్వస్థలం ఒరిజినల్ **దస్తావేజు నెం. 356/1998** తేది.13-12-1998, SRO నరసాపురం, మోటారు సైకిల్ నుండి పాలకొల్లు పట్టణం, లాకుడౌన్ జిరాక్స్‌నకు వెళ్ళు సమయంలో ది. 06-01-2025 న పడిపోయినవి. సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరని జనులను కోరి ప్రార్థించుచున్నాను.

బొంతు నాగభూషణరావు (గాంధీ)
బొంతు ప్రతిభ
అడ్వకేట్స్
షుగర్ కాలనీ
పాలకొల్లు - 534 260
ఫోన్: 226656
సెల్ నెం: 98495 92095

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No. 125/2014

బిట్వీన్:

తిరుమాని తాతయ్య ...వాది

మరియు

సంగాని రాజారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో వాది అయిన తిరుమాని తాతయ్య 4వ ప్రతివాది అయిన ఆంద్రాజు రత్నకుమారి అను మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున, ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలున్న యెడల **ది. 20-02-2025 సం.రం. తేదీన ఉదయం 10-00 గంటలకు** వ్యక్తిగతంగా గాని, వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హజరై కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని యీ ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

శ్రీ **D. మోహన్ మూర్తి,** M.A.,LL.B.,
శ్రీ **V. కుమార స్వామి,** M.A.,B.L.,
వాది తరుపు న్యాయవాదులు
పాలకొల్లు, సెల్: 92905 64185

4వ ప్రతివాది అడ్రస్సు:

ఆంద్రాజు రత్నకుమారి,
W/o. సత్యనారాయణ
డోర్.నెం. 2-130/2,
కలవపూడి, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మరియు జుడిషియల్ 1st క్లాస్ మేజిస్ట్రేటు వారి పాలకొల్లు కోర్టులో

O.S.No. 34/2021

Between:

గెద్దాడ మురళీ మోహన్ ...వాది

మరియు

పెచ్చెటి కాంతం అనే వెంకటలక్ష్మి మరియు ఇరువురు ...ప్రతివాదులు

3వ ప్రతివాది :

పెచ్చెటి దుర్గారావు, S/o. వెంకటేశ్వర్లు (Late), D.No. 2-48(2), గుబాలగుంట, కొత్తపేట, H/o దిగమర్రు, పాలకొల్లు మండలం, ప॥గో॥ జిల్లా, PJCJC.

పై నెంబరు గ్రంథంలో 3వ ప్రతివాది శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా అనేక పర్యాయాలు సమన్లు జారీ చేసిన ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొనకుండా వుంటున్నందున శ్రీ కోర్టు వారు ఆదేశానుసారం ఈ పత్రిక ద్వారా 3వ ప్రతివాదికి సమన్లు జారీ ఉత్తర్వులు యిచ్చియున్నారు. కావున 3వ ప్రతివాది **ది.24-02-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** శ్రీ కోర్టు వారి ఎదుట వ్యక్తిగతముగా కాని, లేదా న్యాయవాది ద్వారా గాని హజరై పై గ్రంథం నందు మీ ఆక్షేపణలు తెలియ పర్చుకోనవలెను. లేని ఎడల సదరు గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బొంతు నాగభూషణరావు (గాంధీ) బి.యస్.సి.,బి.యల్.
బొంతు ప్రతిభ, బి.ఎ.,యల్.యల్.బి.,
పాలకొల్లు అడ్వకేట్స్
ది.12-02-2025 పాలకొల్లు - 534 260
ఫోన్: 226656 సెల్: 98495 92095